ప్రతి ఒక్కరి రక్షణపై భరోసా కల్పించాలి



వైద్యులు, విద్యార్థులకు తమ పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యేకంగా సెక్యూరిటీ సిబ్బందితో రక్షణ కల్పిస్తున్నామనే భరోసా కల్పించాలి. పోలీసులు, న్యాయ వ్యవస్థ నేరాలపై త్వరగా దర్యాప్తు చేసి వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

- డాక్టర్ నాగరాజు, జనరల్ సర్జరీ విభాగం, రిమ్స్, కడప

ప్రతి మహిళా ఉద్యోగి అప్రమత్తంగా విధులను నిర్వహించాలి



ఆసుపత్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఒంటరిగా ప్రయాణాలను చేసేటప్పుడు కచ్చితంగా తమకు అందుబాటులో సెల్‌ఫోన్‌ను ఉంచుకోవాలి. పోలీసు సహాయం కోసం డయల్ 100కు కాల్ చేసి సహాయం పొందవచ్చు

- ఆర్. లక్ష్మీకళ, ఎఫ్.ఎన్.ఓ., ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్),కడప



ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఉద్యోగుల భద్రతపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలి. వైద్యశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులపై జరిగే దాడులను నివారించాలి. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు అందరూ అండగా నిలవాలి.

- రవికుమార్, మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ నాయకుడు, రిమ్స్, కడప

నేరాలపై త్వరగా చర్యలు తీసుకోవాలి



ఏవైనా నేరాలు జరిగినప్పుడు త్వరగా పోలీసులు స్పందించి చర్యలను తీసుకోవాలి. సంఘటనలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలి. చిరుద్యోగి స్థాయి నుంచి ఉన్నత ఉద్యోగి స్థాయి వరకు ప్రతి ఒక్కరూ ఉద్యోగ భద్రత, వ్యక్తిగత భద్రతను కలిగి ఉండాలి.

- గాయత్రి, సీనియర్ అసిస్టెంట్, ప్రభుత్వ వైద్యకళాశాల, రిమ్స్, కడప

క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కమలాపురం : స్థానిక రైల్వే గేటు సమీపంలో వెలసిన శ్రీ రాధా కృష్ణాలయం ఆవరణంలో మంగళవారం గ్రీన్‌కో ఫౌండేషన్ (అనిమలా విండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్) ఆధ్వర్యంలో ఉచిత వైద్య, కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

దుప్పట్లు పంపిణీ



దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

పులివెందుల టౌన్ : స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో విశ్వమాత మదర్‌థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సప్తగిరి హోటల్ యజమాని జగదీశ్వర్‌రెడ్డి, వాసవిక్లబ్ మాజీ అధ్యక్షులు పద్మనాభయ్యలు హాజరై మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జగదీశ్వర్‌రెడ్డి సమకూర్చిన దుప్పట్లను దివ్యాంగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు రఘునాథరెడ్డి మాట్లాడారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ నాయకులు కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్, బషీర్, ఖదీర్, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు


పులివెందుల రూరల్ : పట్టణంలోని నగరిగుట్ట, కదిరిరోడ్డులో పేకాట స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నారాయణ మాట్లాడుతూ సీఐ ఆదేశాల మేరకు పట్టణంలోని రెండు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని నగరిగుట్టలో రూ.23,180లు, కదిరిరోడ్డులో రూ.12,730లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జయకృష్ణా.. ముకుందా.. మురారి

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



సింహాద్రిపురం: పూజలు అందుకుంటున్న శ్రీకృష్ణుడు



కమలాపురం: ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు



లింగాల: రామన్నూతనపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



వల్లూరు(చెన్నూరు): విశేష అలంకారంలో రాధాకృష్ణులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భాకరాపురం సమీపంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో ఉదయం అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని వివిధ రకాల పూలతో అలంకరించారు. జయ కృష్ణా ముకుందా మురారి అంటూ భక్తిపారవశ్యంతో ఆరాధించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే పట్టణంలోని శ్రీవేంకటరమణుడి ఆలయం, అమ్మవారిశాల, గీతామందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.

నేడు ఆలయ వార్షికోత్సవం..

మంగళవారం శ్రీకృష్ణ ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ఉదయం కలశారాధన, ప్రధాన నిత్యహోమాలు నిర్వహించి అనంతరం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కళ్యాణం నిర్వహించనున్నారు.

గోపికల వేషధారణలో చిన్నారులు..

పట్టణంలోని పార్నపల్లెరోడ్డు శ్రీ సరస్వతి విద్యామందిరంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, పాఠశాల అధ్యక్షులు దేవిరెడ్డి రామచంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

లింగాల : లింగాల మండలంలోని రామన్నూతనపల్లె గ్రామంలో వెలసిన శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలు, యువకులు ఉట్టికొట్టేందుకు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. శ్రీకృష్ణుని పాటలతో, భజనలతో ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో వారి తల్లిదండ్రులు పిల్లలకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించి ముగ్ధులయ్యారు.

వేంపల్లె : మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక వడ్డెరవీధిలోని శ్రీకృష్ణ ఆలయం, గండిరోడ్డులోని శ్రీకృష్ణుడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డేరంగుల రామాంజనేయులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం:

సింహాద్రిపురంలో నూతనంగా పునః నిర్మాణమైన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు విజయ, రంగనాయకులు శ్రీకృష్ణుడికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

జమ్మలమడుగు : పట్టణంలోని నారాపురస్వామి ఆలయం వద్ద యాదవుల సంఘం ఆధ్వర్యంలో, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక భక్తుల ఆధ్వర్యంలో మునిరెడ్డి కాంప్లెక్స్‌లో వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని తల్లిదండ్రులు తమ పిల్లలకు కృష్ణుడు, గోపికల వేషాలను వేయించి స్వామి ముందు నృత్యాలను చేయించారు. మధ్యాహ్నం అన్నదానం అనంతరం కృష్ణుణికి గ్రామోత్సవాలను నిర్వహించారు

ఎర్రగుంట్ల : శ్రీ కృష్ణాష్టమి పండుగను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించుకున్నారు. మాలెపాడు గ్రామంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. జువారి సిమెంట్ కర్మాగారంలోని డీఏవీ స్కూల్ నందు కృష్ణాష్టమి పండుగ సందర్భంగా వేడుకలు జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులకు కృష్ణుడు, గోపికల వేషాధారణలతో నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. అంతేకాక ఉట్టికోట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. మాలెపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నిలువెత్తు కృష్ణుడు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మంగళవారం గ్రామంలో స్వామివారిని ఊరేగించనున్నారు.

ఘనంగా శ్రీ కృష్ణా జన్మష్టామి వేడుకలు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కనుల పండువగా వేడుకలు నిర్వహించారు. ఉదయం స్థానిక టీటీడీ దేవాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణుని విగ్రహానికి ఆలయ అర్చకులు కల్యాణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు మునిసిపల్ ఛైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ దంపతులు డాక్టర్ రామేశ్వరుడు, కుటుంబసభ్యులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేయించారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది. అనంతరం సాయంత్రం పట్టణంలోని పురవీధుల గుండా చెక్కా భజన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో జమ్మలమడుగు యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎస్. ఉప్పలపాడు గ్రామంలో..

మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో శ్రీ కృష్ణా జన్మాష్టామి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పురవీధుల గుండా శ్రీ కృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం

ముద్దనూరు : శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను మండలంలోని ఉప్పలూరు గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు .గ్రామంలో ఉన్న మండపంలో కొలువుదీరిన శ్రీకృష్ణ విగ్రహ మూర్తిని సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం నుంచి 4 రోజులపాటు ఈ వేడుకలను నిర్వహించనున్న నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు గ్రామోత్సవంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరపనున్నట్లు తెలియజేశారు.

వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

కమలాపురం : పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో వెలసిన శ్రీ రాధాకృష్ణ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి 8వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయ వ్యవస్థాపకులు పుత్తా నరసింహారెడ్డి దంపతులు, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో క్రిష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, గోపూజ, మూల విరాట్టుకు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు పంచసూక్త అభిషేకాదులు, వేదగోష్టి, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. ఉట్టి కొట్టు కార్యక్రమాన్ని నిర్వహించి, గెలు పొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అలాగే శ్రీ కృష్ణ వేషధారణలో వచ్చిన చిన్నారులకు చిరు కానుకలు అందజేశారు. రాత్రి మంత్రపుష్పము, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. అలాగే ముగ్గుల, బండలాగుడు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కనుల పండువగా..

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లె శ్రీ శివ కృష్ణ గోశాల, అడవిచెర్లోపల్లె గ్రామ సమీపంలో కొండపై వెలసిన వేణుగోపాల స్వామి ఆలయం, మండల కేంద్రమైన వీరపునాయునిపల్లె ఆర్‌అండ్ ఆర్ కాలనీలోని క్రిష్ణాలయంలో సోమవారం క్రిష్ణాష్టమి వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో దర్శనమిచ్చాయి. శివ క్రిష్ణ గోశాలలో గోమాతలకు పూజలు నిర్వహించడంతో పాటు భగవద్గీత పారాయణం భజన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యర్రగుంట్ల నడివీధి రామాలయం భజన బృందం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను అలరించింది. క్రిష్ణాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టు కార్యక్రమంలో పురుషులతో పాటు మహిళలు పోటీపడ్డారు. పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకుడు కల్లూరు రాజశేఖర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. వేడుకల్లో పాల్గొను భక్తులకు ఆలయాల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి, మాజీ మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు తులసిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరులోని శ్రీ సీతారామ నామ సంకీర్తన క్షేత్రంలో వెలసిన రాధాకృష్ణ ఆలయంలో తెల్లవారుజాము నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోపూజ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని గోమాత పూజలు చేయడంతో పాటు రాధా కృష్ణను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణలను ప్రత్యేక అలంకరణ ఆకట్టుకుంది. సాయంత్రం భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు అలాగే కొండపేటలోని ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ఎర్రగుంట్ల: మాలెపాడులో శ్రీ కృష్ణుడి విగ్రహం



జమ్మలమడుగు: గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



వీరపునాయునిపల్లె: సంగాలపల్లె గోశాలలో ఉట్టికొడుతున్న మహిళ

అంధకారంలో జగనన్న కాలనీ



విద్యుత్ సౌకర్యంలేని కాలనీ

ముద్దనూరు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని జగనన్న కాలనీలో విద్యుత్‌సౌకర్యం లేక ప్రజలు అవస్థల పడుతున్నారు. ఈ కాలనీలో సుమారు 100 గృహాలు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటికే కొంతమంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుని కాలనీలో నివసిస్తున్నారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. అయితే విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఇబ్బందుల పాలవుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడం, నివాసముంటున్న ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో కాలనీ అంధకారంలో ఉందన్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇసుకను సద్వినియోగం చేసుకొండి



ఏటూరు స్టాక్‌ఇసుక పాయింట్‌ను ప్రారంభిస్తున్నా ఆర్డీఓ శ్రీనివాసులు

కొండాపురం : మండల పరిధిలోని ఏటూరు గ్రామ సమీపంలోని నూతన జాతీయ రహదారి పక్కన ఇసుక పాయింట్‌ను ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఏటూరు ఇసుక పాయింట్ వద్ద పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టన్ను రూ 340 ధర ప్రకారం అవసరమైన వినియోగదారులు ఇసుకను తీసుకెళ్లవచ్చన్నారు. ఇసుక అక్రమంగా తరలించకుండా సిబ్బంది పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ మాధవక్రిష్ణారెడ్డి, ఎంపీడీఓ నాగప్రసాద్, శివనారాయణరెడ్డి, పి.నాగేశ్వర్‌రెడ్డి, ఆర్.రామంజులరెడ్డి పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

వేంపల్లె: పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి, పులివెందుల ఎస్ఈబీఅధికారులకు అప్పగించామన్నారు.

ప్రియుడితో కలిసి భర్త ప్రాణాలు తీసిన భార్య

సిద్దవటం : వైఎస్సార్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిందో భార్య. సిద్దవటం మండలం లింగంపల్లికి చెందిన గాజుల గంగయ్య(45) కడప కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి. అతనికి జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురానికి చెందిన సంధ్యతో పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడేళ్ల కుమారుడు. మూడేళ్ల కుమార్తె ఉన్నారు. కాగా, సంధ్యకు ఏడాది కిందట పసుపులేటి బలరామ్‌తో పరిచయమైంది. ఈనెల 21వ తేదీ రాత్రి సంధ్య తన ఇంట్లో ప్రియుడితో కలిసి ఉండటం చూసిన గంగయ్య భార్యను మందలించాడు. దీంతో కోపం పెంచుకున్న సంధ్య.. తమకు అడ్డుగా ఉన్న భర్తను చంపేయాలని నిర్ణయించుకుంది. ప్రియుడితో కలిసి అదే రోజు రాత్రి హత్య చేసినట్లు సమాచారం. ఈనెల 24న భర్త గంగయ్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు 25న లింగంపల్లికి వెళ్లి సంధ్యను విచారించారు. ఆమె పొంతన లేని సమాధానం చెప్పడంతో అనుమానించారు. మొదట పెన్నానదిలో దూకాడేమోనని చెప్పింది. దీంతో అక్కడ ఆదివారం సాయంత్రం వరకూ గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసులు సంధ్యను విచారించగా.. గువ్వల చెరువు ఘాట్‌లో పడేశామని చెప్పడంతో గాలించారు. సోమవారం తెల్లవారుజామున గంగయ్య మృతదేహం లభ్యమైంది. శవపరీక్షలు చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటన పూర్తి వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడిస్తామని ఎస్ఐ చిరంజీవి చెప్పారు.

నెల్లూరు జట్టు విజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. 51 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు సోమవారం బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 67.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 323 పరుగులు చేసింది. జట్టులోని షేక్ బాజీ 55 పరుగులు, మాధవ్ 79 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు కనిష్ 3, సాయిసూర్యతేజారెడ్డి 2 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 259 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 174 పరుగులు చేశాడు. కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 237 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మ్యాచ్ డ్రా..

చిత్తూరుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 13 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 70 ఓవర్లలో 231 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిత్ గౌడ్ 71 పరుగులు, భవానీప్రసాద్ 45 పరుగులు చేశారు. కడప బౌలర్లు అస్లాం 4, విజయభవేంద్రారెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసింది. జట్టులోని శివకేశవ రాయల్ 71 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ డానియల్ దాస్ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 450 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా, కడప జట్టు 245 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ



ప్రజా సమస్యలు వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : ప్రజా సమస్యలపై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం వినతిపత్రాలను స్వీకరించారు. భాకరాపురంలోని జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, ప్రజలు సమస్యలు పరిష్కరించాలంటూ వినతుల రూపంలో ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు తెలుసుకున్న ఆయన వాటిని పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్యాలయంలో ఆయన ముందస్తు జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, బయపురెడ్డి, మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం పలుచోట్ల వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు కోడిరమణ, కిషోర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మెన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాల్ గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, నూరుల్లా, రవి, సోఫాల వీరా, జశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పండ్లు పంపిణీ

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఉదయం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, వైఎస్సార్ క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్‌తోపాటు మెడికల్ కళాశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామని పార్టీ నేతలు తెలిపారు. అనాథ వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పాటు అందించాలి

వల్లూరు (చెన్నూరు) : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటు అందించాలని చెన్నూరు సీఐ పురుషోత్తమరాజు సూచించారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో హిందూ, ముస్లిం పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెన్నూరులోని ట్రంకు రోడ్డు సమీపంలో శ్రీ లలితాంబిక నాగేశ్వర స్వామి వారి ధ్వజస్తంభ ప్రతిష్ఠ మూడు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. శివాలయం ఎదురుగా మసీదు ఉండడంతో వారికి ఏమాత్రం ఆటంకం కలగకుండా పూజలు నిర్వహించాలన్నారు. ఉత్సవాలకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే వెంటనే దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పీస్ కమిటీ సభ్యులు జీఎస్ భాస్కర్ రెడ్డి, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా కోసం టీడీపీ వర్గాల ఘర్షణ



టీడీపీ నాయకుల ఘర్షణకు కారణమైన ప్రభుత్వ స్థలం ఇదే



ఓ టీడీపీ నాయకుడు నిర్మించిన పశువుల షెడ్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కొండాపురం మండలం దత్తాపురం సి బ్లాక్‌లోని బుక్కపట్నం కాలనీలో ప్రభుత్వ స్థలం ఆక్రమించుకునేందుకు టీడీపీ నాయకులు ఒకొరికొకరు పోటీ పడి ఘర్షణకు దిగిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీంతో ఇరువర్గాలను తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌కు తీసికొచ్చి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సమాచారం. వివరాలిలా.. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో అధికార పార్టీ నాయకుల కన్ను ప్రభుత్వ స్థలంపై పడింది. ఖాళీ స్థలంలో ఓ టీడీపీ నాయకుడు పశువుల షెడ్ నిర్మించాడు. మరో టీడీపీ నాయకుడు ఆదివారం పశువులకు షెడ్ నిర్మించేందుకు ఖాళీ స్థలంలో కంపచెట్లు తొలగించి చదును చేస్తుండగా ముందు నిర్మించుకున్న టీడీపీ నాయకుడు అభ్యంతరం తెలిపాడు. దీంతో పరస్పరం దాడికి యత్నించారు. గతంలో ఈ స్థలాన్ని గ్రామాభివృద్ధిలో భాగంగా గుడి, బడికి రెవెన్యూ అధికారులు కేటాయించారు. బుక్కపట్నం, దొరువుపల్లి గ్రామాలకు 40 సెంట్లు చొప్పున రెండు పాఠశాలల నిర్మాణానికి అనుమతించారు. మిగతా ఖాళీ స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నించగా గొడవకు దారి తీసింది. గతంలో పాఠశాలకు కేటాయించిన సర్వే నంబర్‌పై వన్‌టైం సెటిల్‌మెంట్ తీసుకున్న వారు అదే కాలనీలో ప్లాట్లు కేటాయించండి తమకు ఇచ్చిన పరిహారం ప్రభుత్వానికి తిరిగి ఇస్తామని హైకోర్టును ఆశ్రయించారు. కాని ప్రభుత్వం అలా చెల్లించేందుకు వీలు లేదని హైకోర్టులో ప్రభుత్వం తరపున వాదనలు జరుగుతున్నాయి. మిగతా 1.20 సెంట్ల స్థలంలో ప్లాట్లు కావాలని కోర్టును ఆశ్రయించడంతో అదే సర్వే నంబర్లు కావడంతో పాఠశాల స్థలంతో పాటు నూతన భవనాలు నిర్మించేందుకు వీలు లేకుండా పోయింది. కేసు కోర్టు పరిధిలో ఉన్నా స్థానిక టీడీపీ నాయకులు మాత్రం కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ స్థలం విషయంపై డివిజనల్ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రాజకీయ ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా చూసి పాఠశాలలు, దేవాలయాలు నిర్మించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

లింగాల: లింగాల మండలం అంబకపల్లె సమీపం లోని అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్నవారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురిని అరెస్ట్ చేశామని ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. జూదరులు ప్రొద్దుటూరు, కడప, పులివెందుల ప్రాంతాలకు చెందినవారన్నారు. జూదరుల నుంచి రూ. 76 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

కఠినమైన చట్టాలను తీసుకురావాలి



ఆసుపత్రుల్లో మహిళా వైద్యులకు భద్రత లేకుండా పోయింది. నిర్భయంగా విధులు నిర్వహించలేని పరిస్థితి తలెత్తుతోంది. ప్రభుత్వాలు మహిళా డాక్టర్ల రక్షణ కోసం కఠినమైన చట్టాలు తీసుకురావాలి. విధుల్లో కూడా సడలింపు ఇవ్వాలి. కోల్‌కత్తా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా దుండగులకు కఠిన శిక్షలు విధించాలి. మహిళా డాక్టర్లకు ప్రత్యేక గదులు కేటాయించాలి. వైద్యశాలల వద్ద సీసీ కెమెరాలు, పోలీసుల గస్తీ తప్పకుండా ఉండాలి.

- డా.ప్రత్యూష, సింహాద్రిపురం



భద్రత తప్పనిసరి



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరగడం అమానుషం. ఈ సంఘటన వైద్య సిబ్బందిని తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఇటువంటి సంఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాలి. ఇందుకు కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బందికి సౌకర్యాలతో పాటు భద్రత కల్పించాలి.

-దిల్షాద్, సీహెచ్‌ఓ, సింహాద్రిపురం

మహిళలకు రక్షణ కల్పించాలి



మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతూనే ఉన్నాయి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన అమానుషం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. వైద్యులు, సిబ్బందిపై కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నా సర్దుకుని పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రులలో భద్రత కల్పించేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలి.

- లక్ష్మీప్రసన్న, ఏఎన్ఎం, సింహాద్రిపురం



స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు : జిల్లాలో వెంటనే స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు మనోహర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామం వద్ద శంకుస్థాపన చేశారు. అక్కడ ఎటువంటి పనులు ప్రారంభించలేదు. ప్రభుత్వం మారిన తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపనతోపాటు భూములను కేటాయించారు. పనులు మాత్రం జరగలేదు. ప్రస్తుతం టీడీపీ కూటమి పార్టీ అధికారంలోకి వచ్చింది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఇక్కడి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసుదాసు, విజయ్, వినయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ జన్మదినం సందర్భంగా సేవాకార్యక్రమాలు

కమలాపురం : కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళ వారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు హార్టికల్చర్ మాజీ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్థానిక అనాథ బాలుర ఛాత్రాలయంలో కేక్ కట్ చేయడంతో పాటు విద్యార్థులకు అన్నదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేయడంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తామని ఆయన అందులో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ఎంపీ అభిమానులు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.











